# రేవతి నుంచి...నవచైతన్యం

సీతా!

ఇప్పుడే బాకుపోటు వంటి సంఘటన చూసి వచ్చాను.

ఒక గంట క్రితం దినపత్రిక చూస్తూ వుంటే యెదుటింటిలో క్రొత్తగా దిగిన రత్తమ్మగారు వచ్చి–

“పిల్లను చూడటానికి పెళ్ళివారు వస్తున్నారు – ఒక్క క్షణంపాటు ఆసరాగా వచ్చిపో అమ్మా!” – అంటూ బలవంతపెట్టారు.

తప్పించుకోవడానికి వ్యర్థప్రయత్నాలు చేసి చివరకు వెళ్ళాను.

మండువాలో మూడు కుర్చీలూ, ఒక బెంచీ అమర్చి వున్నాయి. గది ముందు ఒక తివాచీ పరిచి వుంది. రత్తమ్మగారు నన్ను తిన్నగా గదిలోకి తీసుకవెళ్ళారు. అక్కడే మంచం మీద సగం ఆనుకొని కూర్చుని వుంది – ఆ అమ్మాయి.

ఆ అమ్మాయిని యింతకుముందు చాలాసార్లు చూశాను. ఒకటి రెండుసార్లు మాట్లాడాను కూడా. బంతి వంటి చురుకైన పిల్ల. చామన చాయగా వుంటుంది. పరికిణీ వోణీలతో – చాలా సరదా వేస్తుంది. మన చిన్నతనం జ్ఞాపకం చేస్తుంటుంది. చాలా చక్కగా పాడుతుంది. ‘రతన్’లో పాటలు ఆ అమ్మాయి నోటినే వినాలి.

కాని ఇప్పుడా అమ్మాయిని చూస్తే ఆ అమ్మాయేనా అనిపించింది.

సహజంగా అగపడే ఆ పరికిణీ, వోణీలకు బదులు బొమ్మకు చుట్టబెట్టినట్టు ఒక పట్టుచీర కట్టుకుంది. రేగి, గాలికి యెగిరే మనోహరమైన ముంగురులు విరిచి నున్నగా దువ్వబడ్డాయి. సర్వకాల సర్వావస్థల్లోనూ నవ్వు వెన్నెలలు వెదచల్లే ఆ చక్కని ముఖం పిరికి ఛాయలతో నల్లబడిపోయింది.

ఆమె నా రాకను గమనించి తలెత్తి చూసినప్పుడు బెదిరిపోయిన లేడి దిక్కులు చూట్టం జ్ఞాపకం వచ్చింది.

వచ్చింది నేనుగా గ్రహించాక విశ్రాంతిగా ఆమె విడిచిన నిట్టూర్పు గ్రహించేసరికి నాకెంతో జాలి వేసింది.

“అమ్మయ్య!” అనుకుంది కాబోలు ఆ లేతప్రాణి!

నేనామె దగ్గరకువెళ్ళి పలకరించబోతున్నాను – యింతలోనే రత్తమ్మ గారు అతి తొందరగా వచ్చి, “వచ్చేశారు!” అంది.

శశి చప్న నిలువబడింది.

వాళ్ళ గడబిడ చూస్తే నాకు చాలా ఆశ్చర్యమయింది. రత్తమ్మగారి విషయం అటు వుంచి ఆ అమ్మాయి – పాపం! ఆమె గుండెలు అదరటం స్పష్టంగా అగపడుతోంది.

ఇంతలో వాళ్ళు ప్రవేశించారు. నా దృష్టి అటు తిరిగిపోయింది. కుర్రాడు ఒక వరసను బాగానే వుంటాడు – అదంతా అనవసరంలే!

వాళ్ళు కూర్చున్నాక ఒక నిమిషం రత్తమ్మగారి భర్తా, ఆ పిల్లాడి తండ్రట – అతనూ, ఏవో గోత్రాలూ, భోగట్టాలూ మాట్లాడారు. తర్వాత పిల్లను తీసుకరమ్మన్నారు. రత్తమ్మగారు నన్ను తీసుకవెళ్ళమన్నారు. వరస చూస్తే రెక్కపట్టుక తీసుక వెళ్ళాల్సినట్టు అగపడింది. అలానే “పదమ్మా!” అంటూ చెయ్యి పట్టుకున్నాను. ఎంత వేడిగా వుందనుకున్నావ్! నూటరెండు నూట మూడు డిగ్రీలు వుష్ణం వచ్చినవారి ఒళ్ళు కూడా అంత వేడిగా వుండదనుకుంటాను.

పాపం! వెళ్ళి కూర్చుంది. అక్కణ్ణుంచీ ఆరంభం. ఆ కర్కోటకుడి చూపు పోటులకు ఆ బిడ్డ లోలోన కిరకిర చుట్టుకుందంటే నమ్ము!

అది చాలక ఆ కసాయి మృదువుగా యింకొక...

“సంగీతం నేర్చుకున్నట్టు చెప్పారు కదూ” మాటల్లో సందేహం తీర్చుకునే ప్రశ్నలా గోచరించినా ఆ పోజూ ఆ వెధవ గొంతూ, “ఏదీ ఒక పాట పాడమనండీ!” అని ఆజ్ఞాపించాయి.

నిర్భాగ్యపు తండ్రి! ఆడపిల్లను కనుక్కొన్న దురదృష్టవంతుడు!! ఏం చేస్తాడు? చచ్చినట్లు కూతురుకు పాడమని తాఖీదు చేశాడు.

ఆ బిడ్డ స్థితి వేరే చెప్పను. జరిగిన విషయాన్ని బట్టి గ్రహించు–

ఆమె అంతకుముందు పాడగా మా పడకగదిలోంచి చాలాసార్లు విన్నాను. వెనక నీ పాటకు యెంతో గౌరవం యిచ్చేదానిని. కాని సీతా! ఆ బిడ్డ పాట వింటే నువ్వే నీ ఓటమిని ఒప్పుకుంటావు.

అటువంటిది ఆ స్థితిలో ఆమె పాట యెత్తుకొనేసరికి మీ యెదుటింటి అమ్మాయి జ్ఞాపకానికి వచ్చింది. పైగా వాళ్ళ లోపం కూడా! ఈ విషయమై ఆ అమ్మాయి యివతలకు వచ్చాక అక్కుర్లు బుక్కుర్లు యేడిచిందంటే నమ్ము.

చూడు సీతా! ఆడుబిడ్డ పెండ్లి చేయదలచుకున్న వారు ఆత్మగౌరవాన్ని పూర్తిగా ఎట్లా నాశనం చేసుకోవాలో చూడు.

పైగా–

ఏం చదువుకుంది! పాసయిందా! కాలేజీ హైస్కూల్లోనా! స్కూల్లో చదవటం మానేసి యెన్నాళ్ళయింది! ఇప్పుడు చదవగలదా? లేక నేర్చుకున్నది కాస్తా మరిచిపోయిందా? అల్లికా కుట్టూ వచ్చా? వంటా బాగా చేస్తుందా?

ఇట్లాంటి ప్రశ్నలు యెన్నని చెప్పను?

ఇంతాచేసి లేస్తూ లేస్తూ ఆ పెళ్ళికొడుకు గారు పెదవి విరిచారు.

వెనుకటికి మా తాతగారి పూర్లోనే వున్నప్పుడు యెవరో ఆవును ఒకదానిని కొనడానికి వచ్చారు. బహుశః నువ్వెప్పుడూ ఆవులను కొనే ఫార్సు చూసివుండవు.

ఇద్దరు ముగ్గురూ వచ్చి దాని చుట్టూ మూగుతారు. క్రిందా మీదా ఒకసారి చూస్తారు. దాని నడ్డిమీద చెయ్యి పెట్టి కూడా చూస్తారు. తర్వాత దాని పళ్ళు. ఎన్ని పళ్ళు చేసింది? లేకపోతే ఎన్ని ఈతలీనింది. పడ్డయితే దాని తల్లి యెన్ని పాలిచ్చేది.

తర్వాత ఒకసారి అటూయిటూ నడిపించి చూస్తాడు. అదేదో నడిచేటప్పుడు ఆవుల్లో ఒక లోపం వుంటుందట – అది వుందా లేదా అని చూస్తారు.

అక్కణ్ణుంచీ బేరాలు – అర్థలూ పావలాలూ కొసర్లు వేస్తో! ఇది పశువులను నాణెం చేసేవిధం.

ఈనాడు మన సమాజంలో వివాహాల సందర్భంలో 'నాణెం' కూడా ఇంచుమించు ఇదే పద్ధతులపై సాగుతోంది.

ఎందుచేత? అడిగేవారు లేరు.

పురుషులు – మాది సాంస్కృతిక జాతి అంటూ పరదేశీయులతో డంబాలు కొట్టే పురుషుల్లో ప్రజాస్వామికం కావాలంటూ అర్రులు చాచే పురుషుల్లో – తమ సంఘం ఆచారాల్లోని అనాగరికత, బూర్జువాతనం గుర్తించే విజ్ఞానం, విశాల హృదయం లేదు.

స్త్రీలలో యీ అవమానాల్ని గుర్తించి యెదుర్కొనే అభిమానం, ధైర్యం లేదు.

అంటే – నేను – మంచిచెడ్డలు చూసుకోకుండా పెళ్ళిళ్ళు చేసుకోవాలనటం లేదు. ఎదుటి వారి మంచిచెడ్డలను తప్పకుండా తెలుసుకోవాలి. కాని అందుకు–

"ఏదీ ఒక పాటపాడు! ఏదీ ఒకసారి డాన్సు చెయ్! ఏదీ ఒకసారి కాళ్ళు' పట్టి చూపు! అననక్కరలేదుగా!

వరుని మంచిచెడ్డలు, అర్హతలు తెల్సుకొనేటప్పుడు ఏ స్కూలు ఫైనలో, ఏ బి.ఎ.నో చదువుకున్నాడంటే, ఏ ఆఫీసులోనో వుద్యోగం చేస్తున్నాడంటే మనం నమ్మటం లేదా?

"ఏదీ నీ ఎస్.ఎస్.ఎల్.సి. చూపించూ! ఏదీ నీ పట్టా చూపించూ! ఏదీ ఒక మెమోరాండం డ్రాఫ్టు చెయ్!' –అంటూ ప్రత్యక్షంగా పరీక్షిస్తున్నామా?

మరి వధువును గురించి తెలుసుకొనేటప్పుడు యీ ప్రత్యక్ష పరీక్షలేమిటి? ఎందుచేత యీ లోకువ?

తిరగబడాలి! సీతా! తిరగబడాలి!

నువ్వూ నేనూ కాదు – యీ నాటి కన్యలు ఇకముందయినా యీ అవమానకరమైన దురాచారానికి తిరగబడాలి.

వరుడు వధువు గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించవచ్చు – ప్రయత్నించవలసిన విధి కూడా!

అందుకు అవసరమైతే వారం రోజులో, పది రోజులో తనో లేక తన వారో మర్యాదగా స్నేహితుల వలే వారింట వుండమను. నిత్యజీవితాన్ని పరీక్షించమను. అంతేగాని యీ అసహ్యకరమైన, అవమానకరమైన ప్రత్యక్ష పరీక్షలకు మాత్రం కన్య తల ఒగ్గరాదు.

సీతా, ఈ వైవాహిక కార్యక్రమంలోని కుళ్ళు వెలిబుచ్చాలంటే యింకా చాలా వుంది. కాని యింకొకసారి వ్రాస్తాను. ప్రస్తుతానికి ఈ వుత్తరమే చాలా పెద్దదయి పోయింది.

ఇట్లు – రేవతి ★

*(చిత్రాంగి: మే, 1947)*